

కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బస్తీవాసులు

జిమ్ ఏర్పాటు చేయాలి

● కార్పొరేటర్‌కు గిరినగర్ వాసులు వినతి

చిక్కడపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వీవీ గిరినగర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని గాంధీనగర్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ బస్తీవాసులకు హామీ ఇచ్చారు. ఆదివారం కార్పొరేటర్ కార్యాలయంలో పావనీవినయ్‌కుమార్‌ను కలిసిన గిరినగర్ బస్తీవాసులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. బస్తీలో నిర్మించిన కమ్యూనిటీహాల్ భవనంపై మరో అంతస్తు నిర్మించి బస్తీలోని యువతకు ఉపయోగకరంగా ఉండేందుకు జిమ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బస్తీ అసోసియేషన్ సభ్యుల వినతిమేరకు జిమ్ ఏర్పాటుకు తప్పకుండా కృషి చేస్తామని వారికి హామీ ఇచ్చారు.

సివిల్ సప్లయ్ ఖాళీ స్థలం పరిశీలన

గాంధీనగర్ డివిజన్ ఎస్ఆర్‌టీ క్వార్టర్స్‌లో నూతనంగా నిర్మించిన అమ్మవారి కమాన్ ప్రక్కన ఉన్న సివిల్ సప్లయ్ శాఖకు సంబంధించిన ప్రభుత్వ ఖాళీ స్థలాన్ని కార్పొరేటర్ పావని స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు హాని కలిగించే విధంగామారిన ఖాళీస్థలంలోని చెత్తాచెదారాన్ని తొలగించి నిరుపయోగంగా ఉన్న ఖాళీస్థలంలో ప్రభుత్వ కార్యకలపాలకు ఉపయోగకరంగా ఉండేందుకు అభివృద్ధి పరుస్తామని తెలిపారు.



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసి బస్తీ సమస్యలను వివరిస్తున్న గోల్నాక డివిజన్ తులసీరాంనగర వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన బస్తీ వాసులు

గోల్నాక, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గోల్నాక డివిజన్ తులసీరాంనగర్ బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి తమ బస్తీ సమస్యలను విన్నవించి వినతిపత్రం అందజేశారు. బస్తీలో నెలకొన్న సమస్యలన్నింటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని వారికి భరోసా ఇచ్చారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఎప్పుడు తాను ముందుండి పనిచేస్తానని ఆయన చెప్పారు. కేంద్రమంత్రిని కలిసిన వారిలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సూదగాని శ్రీధర్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు మూల రవీందర్‌గౌడ్, పార్టీ నాయకులు కేసరి నర్సింగ్‌రావుయాదవ్, బస్తీ అసోసియేషన్ ప్రతినిదులు తదితరులు ఉన్నారు.



స్వామివారి పల్లకీకి పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ, మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డి, పల్లకి దాత సతీష్, తదితరులు

మల్లికార్జున స్వామి ఊరేగింపునకు పల్లకి బహూకరణ

ముషీరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): బాకారంలో ప్రసిద్ధిగాంచిన బ్రాహ్మరాంభ మల్లికార్జున స్వామి ఉత్సవాలు, ఊరేగింపునకు ముషీరాబాద్‌కు చెందిన స్వామివారి భక్తుడు సతీష్ ప్రత్యేకంగా తయారు చేసిన పల్లకిని ఆలయ కమిటీ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డికి అందజేశారు. ఆదివారం ఆలయంలో స్వామివారి పల్లకికి వేద పండితులు మధుసుధనా చారిచే ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తూ స్వామివారిని అలంకరించి పల్లకిలో పుర వీధుల్లో ఊరేగించి భక్తులకు దర్శనం కల్పిస్తామని తెలిపారు. ఆలయానికి పల్లకిని అందజేసిన సతీష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఎన్. ఉర్మిల, భక్తులు గోకనవీన్, ముదిగొండ మురళి, రామానందరెడ్డి, సురేష్ కుమార్, జ్ఞానేశ్వర్‌గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు వేంకటేశ్వరస్వామి కల్యాణం

ముషీరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ పద్మశాలి కాలనీలోని సంజీవ ఆంజనేయస్వామి దేవాలయ రెండో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మార్కండేయ, పుండరీకం తెలిపారు. ఆదివారం దేవాలయంలో వార్షికోత్సవం, వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సీనియర్ నాయకుడు బింగి నవీన్, సలహాదారులు ఆంజనేయులు, కృష్ణమూర్తి, కోశాధికారి గడ్డం నవీన్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ యాదవ్‌ను సన్మానించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సయ్యద్ మసూద్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

●యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్

ముషీరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం సద్దిక్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సయ్యద్ మసూద్ ఆధ్వర్యంలో పలువురు మైనార్టీ కాంగ్రెస్ నేతలు అరవింద్ కుమార్ యాదవ్‌ను కలిసి నియోజకవర్గంలోని సమస్యలను వివరించారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా అరవింద్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు జహీర్‌ఉద్దీన్, నాయకులు అల్లాఉద్దీన్, ఉస్మాన్, ఖైరత్‌అలీబాబా తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ

● ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు కృష్ణ మాదిగ

ముషీరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మందకృష్ణ మాదిగ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణకు సాధ్యమయిందని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు గండి కృష్ణ మాదిగ అన్నారు. ఆదివారం ఎస్సీ వర్గీకరణ బిల్లుకు అసెంబ్లీలో ఆమోదం లభించినందుకు అభినందిస్తూ ఇందిరానగర్‌లో ఎమ్మార్పీఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు దశరత్ ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గండి కృష్ణమాదిగ మాట్లాడుతూ 30 ఏళ్లుగా అలుపెరుగని పోరాటం చేసిన మందకృష్ణ మాదిగను రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ మర్చిపోలేరని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి రాజశేఖర్ మాదిగ, నాయకులు ఎల్లయ్య, నందగిరి నర్సింహ, సత్యనారాయణ, వెంకటయ్య, నందు, జీవన్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



భోలక్‌పూర్‌లో నివాళులర్పించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్, జైసింహ, శ్రీనివాస్‌రావు, తదితరులు



భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న హిందూ వాహిని నాయకులు



ఏవీ కళాశాల వద్ద నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత కల్యగోపి



గోల్నాక డివిజన్ గంగానగర్‌లో నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ఆర్.కె.బాబు, తదితరులు

భగత్‌సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలి

ముషీరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్య్రం కోసం ఉరికంబం ఎక్కిన గొప్ప నాయకుడు భగత్‌సింగ్ అని హిందూ వాహిని నగర నాయకుడు బబ్లూ విశ్వేశ్వర్ అన్నారు. ఆదివారం భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని హిందూ వాహిని భోలక్‌పూర్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బబ్లూ విశ్వేశ్వర్ పాల్గొని భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హిందూ వాహిని నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేటి యువతకు స్ఫూర్తి

కవాడిగూడ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమైనవని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు నేటియువత పాల్పడాలని వారుపిలుపునిచ్చారు. కవాడిగూడ డివిజన్‌లోని గగన్ ఏవీ కళాశాల వద్ద ఉన్న భగత్ సింగ్ విగ్రహానికి మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి పూలమలలు వేసి నివాళులర్పించారు.

ఆమ్‌ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో...

న్యాయం స్వేచ్ఛకోసం పోరాడిన భగత్‌సింగ్ నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తారని తెలంగాణ ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. బ్రిటిష్ నిరంకుశ పాలన నుంచి న్యాయం, స్వేచ్ఛ కోసం పోరాడిన భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌లు నేటి తరానికి స్ఫూర్తి అని అన్నారు. భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భోలక్‌పూర్ డివిజన్‌లో...

ముషీరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): దేశాన్ని బ్రిటిష్ పాలకుల కబంహస్తాల నుంచి విడిపించేందుకు భగత్‌సింగ్ తన ప్రాణాలను అర్పించిన పోరాట యోధుడని ఎమ్మెల్యే ముఠా గోపాల్ కొనియాడారు. భోలక్‌పూర్ హౌస్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ యువ నాయకుడు జైసింహ, తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు శ్రీసంత్ శిరోమణి గురు రవిదాస్ మహారాజ్

●హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ



గురు రవిదాస్ మహారాజ్ జయంతి వేడుకలో మాట్లాడుతున్న హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ

నల్లకుంట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రేమ, సమానత్వం ప్రబోధించిన శ్రీసంత్ శిరోమణి గురు రవిదాస్ మహారాజ్ ఆశయాలను ప్రతిఒక్కరూ అనుసరించాలని హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. మానవత్వం, సమానత్వం, భక్తి విలువలను బోధించిన శ్రీసంత్ రవిదాస్ మహారాజ్ సూత్రాలను వ్యాప్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివారం నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్‌లో సంఘర్ జాతి సంఘ్ విద్యానగర్ కమిటీ ఆధ్వర్యంలో శ్రీసంత్ శిరోమణి గురు రవిదాస్ మహారాజ్ జయంతి వేడుకలు జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన గవర్నర్ దత్తాత్రేయ శ్రీసంత్ శిరోమణి రవిదాస్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. నిజమైన భక్తి, ధర్మబద్ధమైన చర్యల ద్వారా మోక్షం లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ సంత్ రవిదాస్ మహారాజ్ సూత్రాలను అనుసరించి సమాజంలో ప్రేమ, సమానత్వం, భక్తిని వ్యాపింపచేయాలని సూచించారు. సంఘర్ జాతి సంఘ్ విద్యానగర్ కమిటీ అధ్యక్షుడు కె.లక్ష్మణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నల్లకుంట కార్పొరేటర్ యాకర అమృత, మాజీ కార్పొరేటర్ వనం రమేష్, బీజేపీ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, బీజేపీ అంబర్‌పేట నియోజకవర్గం కన్వీనర్ శ్యామ్‌రాజ్ ముదిరాజ్, సంఘర్ జాతి సంఘ్ విద్యానగర్ కమిటీ ప్రధాన కార్యదర్శి నర్సింగ్‌రావు, కోశాధికారి లక్ష్మణ్‌ప్రసాద్, ఆర్గనైజర్ విష్ణు హీరాలాల్ కిషోర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల దత్తతకు విశేష స్పందన



ఓ శునకాన్ని దత్తత తీసుకున్న కుటుంబ సభ్యులతో సిటిజన్ ఫర్ యానిమల్స్ సంస్థ నిర్వాహకులు

కవాడిగూడ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సిటిజన్ ఫర్ యానిమల్స్ సంస్థ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాపార్కువద్ద వీధి కుక్కల దత్తత కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి నగర ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. గత సంవత్సరం ప్రారంభించిన సిటిజన్ ఫర్ యానిమల్స్ సంస్థ ఏర్పాటు చేసిన నాటినుంచి నేటి వరకు 52 వీధి కుక్కలను దత్తత తీసుకునేలా కృషి చేసినట్లు సంస్థ వ్యవసాపక అధ్యక్షుడు తేజ, సంస్థ సభ్యురాలు శాలిని తెలిపారు. వీధి కుక్కలకు సరైన ఆహారం, నీటి సదుపాయం అందకపోవడం వల్లే వీధి కుక్కలు విచక్షణ కోల్పోయి ప్రవర్తిస్తాయని వారు పేర్కొన్నారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో సిటిజన్ ఫర్ యానిమల్స్ సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన వీధి కుక్కలతో దత్తత కార్యక్రమం నిర్వహించారు. రెండు వీధి కుక్కలను దత్తత తీసుకున్నారని వారు తెలిపారు. విదేశీ కుక్కల మోజులో పడితే ఇండియన్ శునకాలను ఎవరూ ఆదరిస్తాని వారు ప్రశ్నించారు. భారత దేశంలో ఉన్న వీధి కుక్కలను ప్రతి ఒక్కరూ దత్తత తీసుకొని పెంచుకునే విధంగా అవగాహన కల్పించేందుకు సంస్థ తమ వంతు కృషి చేస్తుందని వారు పేర్కొన్నారు. వీధి కుక్కలను ఉచితంగానే అందజేస్తున్నామని అయితే వీధి కుక్కలను దత్తత తీసుకునే వారు కుటుంబంలో వీధికుక్కను ఎవరు బాధ్యత తీసుకొని పోషిస్తారు. వీధి కుక్కకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, ఇంటి నుంచి బయటకు వెళ్లే సమయంలో కుక్క సంరక్షణ కోసం ఒక మనిషి ఉండాలని, వివిధ షరతులతో వీధి కుక్కను దత్తత తీసుకునే వారు బాండ్ పేపర్‌పై సంతకం చేసి వీధి కుక్క 15 సంవత్సరాల పూర్తి బాధ్యత తమదేనని హామీ ఇచ్చినవారికి అందజేస్తున్నట్లు వారు తెలిపారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

● కాచిగూడ సీఐ జ్యోత్స్న తల్లోజు



కాచిగూడ సీఐ జ్యోత్స్న తల్లోజును సత్కరిస్తున్న కృష్ణగౌడ్

బర్కత్‌పుర, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న ఉగాది, రంజాన్, శ్రీరామ నవమి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని కాచిగూడ సీఐ జ్యోత్స్న తల్లోజు కోరారు. శాంతి భద్రతల పరిరక్షణకు అన్ని వర్గాల ప్రజలు పూర్తి సహకారం అందించాలని అన్నా రు. ఆదివారం జమల్‌బస్తీ గీత పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు బి.కృష్ణగౌడ్ ఆధ్వర్యంలో సీఐ జ్యోత్స్నను శాలువా పూలబొకేతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 30న ఉగాది, 31న రంజాన్, ఏప్రిల్ 6వ తేదీన శ్రీరామనవమి వేడుకలకు భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అసాంఘిక శక్తుల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మైసమ్మ దేవాలయ కమిటీ ప్రమాణ స్వీకారం

గోల్నాక, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గోల్నాక డివిజన్ జైస్వాల్‌గార్డెన్‌కాలనీ వాసులు కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు, అలాగే కాలనీలోని మైసమ్మ దేవాలయ కమిటీకి సంబంధించి రెండు నూతన కమిటీలను ఎంతో ఏకాభిప్రాయంతో ఏకగ్రీవంగా ఎన్నుకొని ఆదర్శంగా నిలిచారో అంతే ఐక్యతతో కాలనీ, ఆలయ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. మీకు నేను ఎల్లవేళల అండదండగా నిలిచి కాలనీ, దేవాలయ అభివృద్ధిలో భాగస్వామ్యమై పనిచేస్తానని ఆయన అన్నారు. ఆదివారం గోల్నాక డివిజన్ జైస్వాల్‌గార్డెన్ కాలనీ జరిగిన కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ, మైసమ్మ దేవాలయం నూతన కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పాల్గొని నూతన కమిటీల చేత ప్రమాణ స్వీకారం చేయించి వారికి నియామకపుపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, శ్రీమైసమ్మ దేవాలయ కమిటీల నూతన కార్యవర్గాలను అభినందిస్తూ కాలనీలోని ఏసమస్య ఉన్నా తన దృష్టికి తీసుకవస్తే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని అన్నారు. కాలనీ అన్నప్పుడు అన్ని రాజకీయ పార్టీల వారుంటారని కాని కాలనీ అభివృద్ధి విషయంలో మాత్రం రాజకీయలకతీతంగా వ్యవహరించి అభివృద్ధి కోసం కలిసి కట్టుగా పనిచేయాలని కోరారు.



వైద్య శిబిరంలో పరీక్షలుచేసి మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్లు

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ముషీరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని ప్రార్థన వీరుల చర్చ్ పాస్టర్ మరిదాస్ అన్నారు. ఆదివారం రాంనగర్‌లోని ప్రార్థన వీరుల చర్చిలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి పరీక్షలు, దంత పరీక్షలు, బీపీ, షుగర్, ఈసీజీ, తదితర వైద్య పరీక్షలు వైద్యులు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన మరిదాస్ మాట్లాడుతూ కార్పొరేట్ వైద్య సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు మానవత దృక్పథంతో పేద ప్రజలు నివసించే ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్ జేమ్స్, నిర్వాహకులు ఎప్రా, బెన్నీ తదితరులు పాల్గొన్నారు.

బాలికా సదన్ నుంచి పారిపోయిన బాలికల గుర్తింపు

బర్కత్‌పుర, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ పీఎస్ పరిధిలోని నింబోలి అడ్డ ప్రభుత్వ బాలికా సదన్ నుంచి పారిపోయిన ఇద్దరు అక్కాచెల్లెళ్లలో పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. కాచిగూడ పీఎస్ అడ్మిని ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం... శనివారం ఉదయం బాలికా సదన్ నుంచి ఇద్దరు అక్కాచెల్లెళ్లు చెట్టు ఎక్కి గోడదునికి పారిపోయిన విషయం విదితమే వారిద్దరూ వరంగల్‌లోని అమ్మమ్మ ఇంట్లో ఉండగా ఆదివారం సాయంత్రం కాచిగూడ పోలీసులు పట్టుకున్నారు. వారిని నగరానికి తీసుకొని వచ్చి రాత్రి బాలికా సదన్ అధికారులకు అపగించినట్లు అడ్మిన్ ఎస్ఐ సుభాష్ తెలిపారు.

అదృశ్యమైన లావణ్య ఆచూకీ లభ్యం

బర్కత్‌పుర, మార్చి 23(ఆంధ్రజ్యోతి): భర్తతో గొడవపడి పుట్టింటికి వచ్చి తన ముగ్గురు పిల్లలను తీసుకొని అదృశ్యమైన లావణ్య ఆచూకీని పోలీసులు గుర్తించారు. కాచిగూడ పీఎస్ అడ్మిన్ ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల 21న లావణ్య తన ముగ్గురు పిల్లలతో కలిసి అదృశ్యమైన విషయం విదితమే, లావణ్య నిజామాబాద్‌లోని వాళ్ల అక్క ఇంటివద్ద ఉండగా గుర్తించి ఆమెతో పాటు ముగ్గురు పిల్లలను తీసుకొని వచ్చి ఆదివారం రాత్రి తల్లిదండ్రులకు అపగించినట్లు అడ్మిన్ ఎస్ఐ సుభాష్ తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం



నిఖిత

బర్కత్‌పుర, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కాచిగూడలో ఇంటర్ విద్యార్థిని అదృశ్యమైంది. కాచిగూడ పీఎస్ అడ్మిని ఎస్ఐ డి.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం... రహ్మత్‌బాగ్‌లో నివాసం ఉంటున్న వెంకటేష్ కుమార్తె నిఖిత(20) ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేసింది. శనివారం సాయంత్రం 3 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. తండ్రి వెంకటేష్ కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిని ఎస్ఐ సుభాష్ తెలిపారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

బర్కత్‌పుర, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... బుద్వేల్-ఉందానగర్ రైల్వే స్టేషన్ల నడుమ ఆదివారం 60 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



వీఎస్టీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందులో మాజీ ఎంపీ, ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి, కార్మిక నాయకులు

ఇఫ్తార్ విందులు మతసామరస్యాన్ని పెంపొందిస్తాయి

● ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి

రాంనగర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఇఫ్తార్ విందులు మతసామరస్యాన్ని పెంపొందించేందుకు దోహదం చేస్తాయని మాజీ ఎంపీ, ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు, వీఎస్టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు జీ.సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం బాగ్‌లింగంపల్లిలోని వీఎస్టీ ఫంక్షన్ హాల్‌లో వీఎస్టీ వర్కర్స్ యూనియన్ మైనారిటీ నాయకులు అబ్దుల్ సమద్, హబీబ్‌షరీఫ్, ఇస్మాయిల్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వీఎస్టీ కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తామన్నారు. కార్మికుల సంక్షేమమే ఐఎన్‌టీయూసీ, కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో వీఎస్టీ కంపెనీ డీజీఎం శివకుమార్, అయ్యార్ శ్యామల, డాక్టర్ విక్రమ్, ఆనంద్, వీఎస్టీ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.రాజు, ఎల్.డి.పాల్, నాగేష్, ఎ.ఆర్.శ్రీనివాస్‌యాదవ్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాగ్‌అంబర్‌పేటలోని ఆజీజ్ మసీదు వద్ద జరిగిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి తదితరులు

రంజాన్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

రాంనగర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండగను మైనారిటీలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కోరారు. బాగ్‌అంబర్‌పేటలోని ఆజీజ్ మసీదు వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన ఇఫ్తార్ వేడుకలకు కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి దంపతులతో ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. మైనారిటీల సంక్షేమానికి బీఆర్ఎస్ కట్టుబడి ఉందన్నారు. రంజాన్ పండగ సందర్భంగా మసీదుల వద్ద మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.



పుస్తక ప్రదర్శనను ప్రారంభించిన డా. గుమ్మడి వెన్నెల

పుస్తక పఠనంతో మానసిక వికాసం

● డా. గుమ్మడి వెన్నెల

చిక్కడపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పుస్తకం మనిషిని ఉన్నతునిగా తీర్చిదిద్దుతుందని, పుస్తక పఠనంతో మానసిక వికాసం కలుగుతుందని రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్ పర్సన్ డా. గుమ్మడి వెన్నెల అన్నారు. తెలంగాణ బుక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఆదివారం వెన్నెల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుస్తక పఠనం విజ్ఞానాన్ని, చైతన్యాన్ని నింపుతుందన్నారు. నెలకు ఒక పుస్తకమైనా చదవాలన్నారు. ప్రతి ఇంట్లో తల్లిదండ్రులు పుస్తకాలు చదివితే వారిని చూసి పిల్లలు చదువుతారన్నారు. రామానందతీర్థ గ్రామీణ యూనివర్సిటీ చైర్మన్ నారా కిషోర్‌రెడ్డి, కోయ చంద్రమోహన్, వాగ్దేవి, చక్రవర్తి, నరసింహారావు, గురుమూర్తి, నరేష్, సుధాకర్ పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏనుగు నరసింహారెడ్డి తదితరులు

మిత్రలాభం, ప్రభాత కిరణాలు పుస్తకాల ఆవిష్కరణ

చిక్కడపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో ఏదైనా నశించిపోతుందేమో కాని పుస్తకం మాత్రం చిరకాలం నిలిచి ఉంటుందని తెలంగాణ సాహిత్య అకాడమి పూర్వ కార్యదర్శి డా. ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. భవాని సాహిత్య వేదిక కరీంనగర్ ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాయగానసభలో వేదిక అధ్యక్షులు వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన గుండవరం చంద్రశేఖర్ రచించిన మిత్రలాభం పద్యకావ్యం, ఆయన కుమారుడు గుండవరం ప్రభాకర్‌రావు రచించిన ప్రభాత కిరణాలు పుస్తకాలను ఏనుగు నరసింహారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్యాన్ని వచనంలోకి మార్చడం సులభమేమో కాని వచనాన్ని పద్యంలోకి మార్చడం అంత సులువు కాదన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ మాట్లాడుతూ చంద్రశేఖరరావు రచించిన మిత్రలాభం ఉత్కృష్టగ్రంథంగా నిలుస్తుందన్నారు. డా. కాంచనపల్లి గోవర్ధన్‌రాజు, సినీ గేయరచయిత మౌనశ్రీ మల్లిక్, డా. రాధా కుసుమ, తదితరులు పాల్గొన్నారు.